సాక్షి వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



బాబు పగ.. పండుటాకులకు బెంగ

ప్రతినెలా వలంటీర్లు ఠంచన్‌గా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేశారు. ప్రస్తుతం బాబు చేసిన నిర్వాకం వల్ల పండుటాకులకు బెంగ పట్టుకుంది. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
కడప	: 6.31	4.54
పులివెందుల	: 6.34	4.49
ప్రొద్దుటూరు	: 6.33	4.58

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.4/24.4

జిల్లాలో మంగళవారం 24.4 - 42.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్



మదనపల్లిలో జరిగిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జనసంద్రంలో జగన్నినాదం

ఆంధ్రుల అభిమాన నేత.. సంక్షేమ పథకాల ప్రదాత.. ప్రియతమ ముఖ్యమంత్రి, జనా కర్షక నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్నమయ్య జిల్లా జయ జయ ధ్వానాలతో ఘన స్వాగతం పలికింది. మేమంతా సిద్ధం అంటూ ఎన్నికల ప్రచార పర్వానికి కదిలిన ప్రజానేతకు జై అంటూ అడుగడుగునా జనం బ్రహ్మరథం పట్టారు. ఊరూ వాడా జన సంద్రమైంది. సంక్షేమ సారథీ మా మద్దతు మీకే అంటూ అక్కచెల్లెమ్మలు కదం తొక్కారు. అభివృద్ధి ప్రదాతా నీతోనే మేమంటూ పల్లెజనం పదం పాడారు. ఇడుపులపాయలో మహానేత వైఎస్సార్ ఘాట్‌వద్ద నివాళులర్పించి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ అధినేత ఆరో రోజైన మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గం మీదుగా మదనపల్లెకు చేరుకున్నారు. ప్రతిచోటా ప్రజలు పుష్పాభిషేకం చేశారు. సార్వత్రిక సమరంలో విజయ తిలకం దిద్దేందుకు మేమంతా సిద్ధం అంటూ నినదించారు.. జగనన్నా.. మళ్లీ నువ్వే రావాలి అని ఆశీర్వదించారు.

- మదనపల్లిలో మేమంతా సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనం
- ఎన్నికలకు మేమంతా సిద్ధం అంటూ నినదించిన శ్రేణులు
- ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ బాబు పేరెత్తగానే శ్రేణుల్లో ఉత్సాహం
- ఎన్నికలకు కార్యకర్తలను సన్నద్ధం చేసిన సీఎం జగన్
- మధ్యాహ్నం నుంచి సభ ముగిసే వరకు కార్యకర్తల్లో తగ్గని జోష్
- సిద్ధం విజయవంతంతో కార్యకర్తలు, నాయకుల్లో నూతనోత్సాహం

సాక్షి,రాయచోటి : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమరశంఖం పూరించారు. ఇప్పటికే రాష్ట్రంలో సిద్ధం సభలు విజయవంతం కావడంతో.. మరోమారు మేమంతా సిద్ధం కార్యక్రమానికి పార్టీ శ్రీకారం చుట్టింది. ఒక వైపు బస్సు యాత్రలో భాగంగా ఊరూరా జనాన్ని కార్యోన్ముఖులను చేస్తూ.. మరో వైపు మేమంతా సిద్ధంతో ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. ఊరు, వాడ.. పల్లె, పట్టణం, కులం, వర్గం, మతం తారతమ్యాలు లేకుండా జనం కదిలి వచ్చారు. చిన్నారులు మొదలుకుని పండుటాకుల వరకు.. యువతులు మొదలుకుని మహిళల వరకు కదన రంగంలో జగన్‌కు జై కొడుతున్నారు. సంక్షేమ ఫలాలు అందుకున్న మేమంతా మీకు తోడుగా సిద్ధం అంటూ వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తున్నారు. మదనపల్లి పట్టణంలోని రోడ్లన్నీ జనంతో నిండిపోగా.. టిప్పు సుల్తాన్ మైదానం ఇసుక వేస్తే రాలనంత జనం రాకతో మేమంతా సిద్ధం సభ సూపర్ సక్సెస్ అయింది.

కదం తొక్కిన జనాలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన తొలి 'మేమంతా సిద్ధం' సభకు జనాలు కదం తొక్కారు. ప్రధానంగా ముస్లిం మైనారిటీ వర్గాలతో పాటు ఇతర ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు. బస్సు యాత్రలో భాగంగా మైదానం లోపలికి రావడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు చాలా సమయం పట్టిందంటేనే ఎంత జనం వచ్చారో అర్థం చేసుకోవచ్చు.

మండుటెండలోనూ శ్రేణుల్లో తగ్గని జోష్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో రావాల్సి ఉండగా సుమారు 5.20 గంటల ప్రాంతంలో మైదానానికి చేరుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మధ్యాహ్నమే మైదానానికి చేరుకున్నా.. సూర్యభగవానుడు నిప్పులు కురిపిస్తున్నా ఏ మాత్రం లెక్క చేయకుండా ఉత్సాహంగా కనిపించారు.

ఆకట్టుకున్న జగన్ ప్రసంగం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. ముఖ్యంగా మూడు పార్టీలు జతకట్టి వస్తున్నాయని.. జగన్‌కు మాత్రం మీ గుండెల్లో గుడికట్టుకోవడమే లక్ష్యం అన్న చెప్పినప్పుడు సభికుల నుంచి విశేష స్పందన కనిపించింది. అంతేకాకుండా అరుంధతి సినిమాలో పశుపతి సమాధిని బద్దలు కొట్టుకుని వచ్చినట్లు ఇక్కడ బాబు కూడా ప్రజలను ఏదోరకంగా మాయమాటలతో బురిడీ కొట్టించడానికి వదల బొమ్మాలి అంటూ వస్తున్నాడని చెప్పగానే... బాబు వదిలి పోయేలా మేము చేస్తామంటూ కేరింతలు కొట్టారు. 2014లో మూడు పార్టీలు, నాయకులు ఇచ్చిన హామీలను విస్మరించడంపై జనాలను అడుగుతూ జగన్ ప్రసంగించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది.

సభ సూపర్ సక్సెస్

అన్నమయ్య జిల్లాలో బస్సు యాత్రతోపాటు మదనపల్లెలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభ సూపర్ సక్సెస్ అయింది. క్యాడర్‌తోపాటు ప్రజలు, మహిళలు, పార్టీ శ్రేణులు ఇలా అందరూ పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనడం.. సభకు ఊహించిన దానికంటే జనం ఎక్కువ రావడంతో పార్టీలో నూతనోత్సాహం కనిపిస్తోంది. గతంలోనూ ఇదే మైదానంలో ప్రభుత్వ కార్యక్రమం చేపట్టిన సందర్భంతోపాటు ఇప్పుడు నిర్వహించిన పార్టీ కార్యక్రమానికి అంతకంటే ఎక్కువ సంఖ్యలో ప్రజలు రావడం గమనార్హం. ఏది ఏమైనా మేమంతా సిద్ధం సభ పార్టీలో కొత్త ఉత్సాహం నింపింది.

బస్సు యాత్ర సాగిందిలా

బి.కొత్తకోట: అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో మంగళవారం మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతంగా సాగింది. సత్యసాయి-అన్నమయ్య జిల్లాల సరిహద్దు నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది.

- **10.25 గంటలు:** విడిది శిబిరం నుంచి బస్సు యాత్ర ప్రారంభం.
- **10.45 గంటలు:** ములకలచెరువులో బస్సు యాత్రకు కిక్కిరిసిన జనం, గజమాలతో ఘన స్వాగతం
- **11.05 గంటలు:** పెద్దపాళ్యంలో బస్సు దిగి మహిళలతో మాటామంతి
- **11.15 గంటలు:** గురికివానిపల్లెలో మహిళలకు ఘనస్వాగతం
- **11.20 గంటలు:** ఉమాశంకర్ కాలనీ వద్ద సీఎం జగన్‌కు పూలవర్షంతో స్వాగతం పలికిన ప్రజలు
- **11.25 గంటలు:** వేపూరికోటలో వైఎస్ జగన్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలచే ఘనస్వాగతం. బస్సు దిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.
- **11.35 గంటలు:** ఆవులపల్లె వద్ద వృద్ధ మహిళలు తమ బిడ్డ జగన్‌ను చూడాలని వేచి ఉండగా బస్సు ఆపి వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడారు.
- **11.47 గంటలు:** బురకాయలకోట బైపాస్‌లో బస్సు యాత్ర చూసేందుకు తరలివచ్చిన జనాన్ని చూసి..బస్సు ఆపించి, బస్సు దిగి ప్రజలు, అభిమానులతో ముచ్చటించారు.
- **12.08 గంటలు:** తుమ్మనంగుట్టకు చేరుకున్న వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం, బస్సు దిగి పలుకరించారు.
- **12.12 గంటలు:** కనికలతోపు చేరుకున్న బస్సు యాత్రకు స్వాగతం, బస్సు దిగి ప్రజలతో మమేకమైన సీఎం జగన్
- **12.30 గంటలు:** కోటిరెడ్డిగారిపల్లె వద్ద ఘన స్వాగతం
- **12.40 గంటలు:** పెద్దపల్లె వద్ద స్వాగతం పలికిన ప్రజలు
- **12:47 గంటలు:** హార్సిలీహిల్స్ క్రాస్ చేరుకున్న వైఎస్ జగన్‌కు భారీ స్వాగతం, బస్సు దిగి ప్రజలను ప్రేమగా పలుకరించిన వైఎస్ జగన్.
- **1.30 గంటలు:** అంగళ్లు సమీపంలోని గోల్డెన్‌వ్యాలీ కళాశాల వద్ద పూలు చల్లి విద్యార్థుల స్వాగతం
- **1.40 గంటలు:** అంగళ్లు చేరిన బస్సు యాత్ర..వైఎస్.జగన్‌కు అఖండ స్వాగతం. బస్సుపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన వైఎస్.జగన్. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన జనం.
- **4.10 గంటలు:** విశ్రాంతి విడిది నుంచి బస్సు యాత్ర ప్రారంభం
- **4.32 గంటలు:** చేనేతనగర్‌కు చేరిన బస్సు యాత్ర..ఘనస్వాగతం పలికిన జనం..బస్సు దిగి పలుకరించిన వైఎస్ జగన్
- **4.42 గంటలు:** తంబళ్లపల్లె-మదనపల్లె సరిహద్దు అమ్మచెరువుమిట్ట నుంచి మదనపల్లె నియోజకవర్గంలోకి ప్రవేశించిన బస్సు యాత్ర
- **5.10 గంటలు:** బహిరంగ సభ టిప్పు సుల్తాన్ మైదానం చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

అభ్యర్థులు వీరే..



పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (రాజంపేట ఎంపీ)

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (పుంగనూరు)

గడికోట శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి)

ఎ.అమర్‌నాథ్‌రెడ్డి (రాజంపేట)

కె.శ్రీనివాసులు (రైల్వే కోడూరు)

ద్వారకనాథరెడ్డి (తంబళ్లపల్లె)

నిస్సార్ అహ్మద్ (మదనపల్లి)

సి. రామచంద్రారెడ్డి (పీలేరు)

తన్మయత్వంలో తంబళ్లపల్లె

- తంబళ్లపల్లె నియోజకవర్గంలో జననేతకు బ్రహ్మరథం

బి.కొత్తకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. యువకులు, మహిళలు, కర్షకులు, కార్మికులు, కూలీలు..ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చి తమ నాయకుడికి సంఘీభావం ప్రకటించారు. బస్సు యాత్రకు ముందు సాగిన వాహనంలో పాటలకు అనుగుణంగా అభిమానులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పార్టీ జెండాలతో జై జగన్ అంటూ నినదించారు. బస్సు యాత్ర నియోజకవర్గం దాటి మదనపల్లెలోకి ప్రవేశించినా తంబళ్లపల్లె అభిమానులు బస్సును అనుసరించారు. మదనపల్లెలోకి బస్సు చేరగానే జనం పెద్దసంఖ్యలో స్వాగతం పలికారు. సత్యసాయి-అన్నమయ్యజిల్లా సరిహద్దులో విడిది చేసిన వైఎస్ జగన్ మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గంలో మేమంతా సిద్ధం బస్సు యాత్రను ప్రారంభించారు. షెడ్యూల్ మేరకు ఉదయం 9 గంటలకు యాత్ర ప్రారంభం అవుతుందని ప్రకటించగా నేతలు, ప్రజల రాకతో ఆలస్యంగా మొదలైంది. బస్సులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఉన్నారు. వీరు బస్సు ఆగిన చోటల్లా పార్టీ ముఖ్యలను సీఎంకు పరిచయం చేశారు. అమ్మచెరువుమిట్ట వద్ద బస్సు యాత్ర మదనపల్లె నియోజకవర్గంలోకి ప్రవేశించగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ గుండ్లూరి షమీమ్ అస్లామ్ బస్సులోకి వెళ్లారు.



ములకలచెరువు మండలంలో సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న జనం

ములకలచెరువు, అంగళ్లులో భారీ జనం

తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు జాతీయ రహదారి పట్టనంతగా జనం తరలివచ్చారు. విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన యాత్ర తొలుత ములకలచెరువు చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. ములకలచెరువులో రోడ్డుపై జనం పరుగులు తీస్తూ వెంట వస్తుండగా, భవనాలు, రోడ్లపై నిలబడి చూస్తున్న మహిళలకు వైఎస్ జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సీఎం వైఎస్ జగన్ దారి పొడవునా బస్సును ఆపి ప్రజల వద్దకు వచ్చి ఆప్యాయంగా పలకరించారు.



అడుగో నాన్న జగన్ మామయ్య..

తరలివచ్చిన జనం

తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు భారీసంఖ్యలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చారు. ములకలచెరువు, బి.కొత్తకోట, కురబలకోట మండలాల మీదుగా సాగింది.

దారి పొడవునా బైక్ ర్యాలీ

ములకలచెరువు నుంచి అమ్మచెరువుమిట్ట వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు మేమంతా సిద్ధం బస్సు యాత్ర వెంట 40 కిలోమీటర్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. గుండెల్లో గూడుకట్టుకున్న అభిమానాన్ని చాటుకున్నారు.



జనానందం: వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో ఇలా..



పార్టీ జెండాతో వీరాభిమాని



వేపూరి కోటలో జగన్‌కోసం ఎదురుచూస్తూ...



అంగళ్లులో వైఎస్ జగన్‌కు కొబ్బరి బోండం ఇస్తున్న మహిళ

సమస్యలేమైనా ఉన్నాయా? బస్సు యాత్రలో ప్రజలను అడిగిన జగన్



మహిళా కూలీని ఆప్యాయంగా పలకరిస్తూ...

కురబలకోట: మండలంలో కంటేవారిపల్లె, దొమ్మన్నబావి, అంగళ్లు, చేనేతనగర్, సర్కారుతోపు, అమ్మచెరువు మిట్ట వద్ద బస్సు దిగి సీఎం జగన్ ప్రజలతో మాట్లాడారు. ఏమైనా సమస్యలున్నాయా అంటూ ఆప్యాయంగా అడిగారు. తెట్టు శీతమ్మ అంగళ్లులో ఆయనను కలిశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ఒకటిన్నర లక్ష రాలేదని కంటతడిపెట్టింది. దీంతో అప్పటికప్పుడే వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. అంగళ్లు వాటర్ ట్యాంక్ వీధికి చెందిన మరో వృద్ధురాలు షాబీరా (63) తన కుటుంబం అప్పులతో చితికిపోయిందని, కుమార్తె ఒక చోట.. అల్లుడు మరో చోట ఉన్నారంటూ ఆదుకోవాలని కోరింది. అల్లుడు చింతకాయల వ్యాపారం చేసి నష్టాల పాలయ్యాడన్నారు. అప్పుల వాళ్లకు భయపడి కువైట్‌కు వెళ్లిపోయాడని తెలిపింది. అక్కడ కూడా చాలీ చాలని ఆదాయంతో ఇబ్బందులు పడుతున్నాడన్నారు. ఎలాంటి ఆస్తి పాస్తులు లేవని తెలిపింది. ఆదుకోకపోతే అప్పుల ఊబి నుండి బయటపడలేమని ఆమె జగన్‌ను వేదనతో కోరింది. తప్పకుండా ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. జగన్‌ను ఈమెను బస్సులో నుంచి చూసి దిగి కిందకు వచ్చి స్వయంగా విని హామీ ఇవ్వడం విశేషం. అదే విధంగా అంగళ్లులో ఓపీ స్టేషన్ వద్ద ఓ చిన్నారి జగన్‌ను చూడ్డానికి రోడ్డుపైకి వచ్చింది. ఆ రద్దీలో చిన్నారి పడిపోయింది. గమనించిన జగన్ వెంటనే బస్సు దిగి ఆ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడి జాగ్రత్తగా వెళ్లమ్మా అంటూ సూచించారు.

మేమంతా సిద్ధం : మదనపల్లె సభలో సెల్‌ఫోన్ లైట్ వేసి చూపిస్తున్న జనం (ఇన్‌సెట్) **అపూర్వ స్వాగతం :** మదనపల్లెలో హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు







ఆత్మీయ అభివాదం : ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అపురూప కానుక : అంగళ్లులో జగనన్నకు కానుక అందజేస్తున్న సోదరి



భరోసా : అంగళ్లులో వృద్ధుడి సమస్యను ఆలకిస్తూ..



యువ తరంగం : వేపూరికోటలో యువకుల కేరింతలు

జననేతకు బ్రహ్మరథం

అవ్వాతాతలు కదిలొచ్చారు.. మనవడిని చూసి మురిసిపోయారు. అక్కాచెల్లెమ్మలు తరలివచ్చారు.. సోదరుడిని చూసి సంతోషంతో ఉప్పొంగి పోయారు. యువకులు పరుగున వచ్చారు.. అన్నను చూసి ఉత్సాహంతో ఉరకలేశారు. ఇలా ఒకరేమిటి.. జననేతను చూసి అందరూ ఆనంద భరితులయ్యారు. అభిమాన నేతపై ఆత్మీయ జల్లు కురిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం అన్నమయ్య జిల్లాలో చేపట్టిన బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభించింది. అడుగడుగునా ఆయనపై పూలవర్షం కురిపించారు. – సాక్షి, నెట్‌వర్క్



ఊరంతా పండగ : ములకలచెరువులో బస్సుయాత్రపై పూల వర్షం కురిపిస్తున్న గ్రామస్తులు



మహా నివాళి : మదనపల్లెలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న సీఎం జగన్



గుండె నిండా జెండా.. కాండ్లమడుగులో ప్రజల ఆనందహేల



మదనపల్లె మేమంతా సిద్ధం సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నేతలు



నీరాజనం : అంగళ్లులో బస్సు యాత్రలో పాల్గొన్న అశేష జనవాహిని



సమరోత్సాహం : అంగళ్లులో యుద్ధానికి మేం సిద్ధం అంటున్న అభిమానులు



మా నమ్మకం నువ్వే జగన్ : అంగళ్లులో మహానేత వైఎస్సార్ చిత్రపటంతో దివ్యాంగుడు

అత్యవసర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

కడప సెవెన్‌రోడ్స్ : అత్యవసర విధులలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎసెషియల్ సర్వీసెస్ కేటగిరి కింద పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడం జరిగిందని డీఆర్‌డీఏ పీడీ, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ఆనంద్‌నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ మీటింగ్ హాలులో పోస్టల్ బ్యాలెట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ ఎలక్షన్స్ 2024లో భాగంగా వైఎస్ఆర్ జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రాసెస్‌లో పోలింగ్ రోజున 33 అత్యవసర విభాగాలు/శాఖలు, అత్యవసర విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 10వ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ అవసరమైన సిబ్బంది వివరాలను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీవో ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్, అధ్యాపకులు

వేంపల్లె : ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ, రజిత పథకాలను సాధించారని డైరెక్టర్ ఏపీఎస్ కుమారస్వామి తెలిపారు. గత నెల 30, 31 తేదీల్లో ట్రిపుల్ ఐటీలోని పీయూసీ-1, 2 చదువుతున్న విద్యార్థులు ఎన్టీఆర్ జిల్లా చిలుకూరు గ్రామంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు స్వర్ణ, నాలుగు రజిత, ఒకటి కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. బాలికల విభాగంలో బి.సువర్ణ, హర్షిత, తివారి బంగారు పతకాలు, పి.వైష్ణవి రజిత పతకాలు సాధించారని పేర్కొన్నారు. బాలుర విభాగంలో రాఘవేంద్ర బగారు పతకం, కార్తీక్ మోహన్‌రావు, డాక్టర్ బాల గోవింద తివారీలు రజిత పతకాలు సాధించారన్నారు. అండర్-17 విభాగంలో గర్షిత తివారి కాంస్య పతకం సాధించిందన్నారు. ఆ విద్యార్థులను డైరెక్టర్‌తోపాటు అధ్యాపక బృందం మంగళవారం అభినందించారు.

బాబు పగ.. పండుటాకులకు బెంగ

- పింఛన్ల పంపిణీ సాఫీగా సాగేనా?
- జిల్లాలో 2,68,179 పింఛన్లు
- రూ.79.31 కోట్లకు పైగా లబ్ధి
- తక్కువ సంఖ్యలో ఉన్న సచివాలయ సిబ్బంది
- నేటి నుంచి 6వ తేదీ వరకు పంపిణీకి చర్యలు

తెల్లవారుజాము నుంచి పింఛన్ల పంపిణీలో వలంటీర్‌ల ఆప్యాయ పలకరింపులు అవ్వాతాతలకు ఉండవు. చంద్రబాబు పండుటాకులు అనే కనికరం కూడా చూపలేదు. పింఛన్లపై పగపట్టారు. వలంటీర్‌లపై అక్కసు వెళ్లగక్కారు. ఫలితంగా మొదటి సారిగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద వలంటీర్‌లు లేకుండానే పింఛన్ల పంపిణీ ప్రక్రియ జరగనుంది. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందే వారికి.. ఇంటి వద్ద మంచానికే పరిమితమైన వారికి పింఛన్ సొమ్ము సకాలంలో చేరుతుందా లేదా అనే బెంగ లబ్ధిదారుల్లో కలుగుతోంది.

కడప రూరల్ : ప్రతి నెలా వలంటీర్‌ల ద్వారా ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్ పంపిణీ జరిగేది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వలంటీర్‌ల వ్యవస్థపై ఆరోపణలు చేయడంతో పింపిణీపై గందరగోళం నెలకొంది. అదే సందర్భంలో ఆయన చర్యలపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరిగే పింఛన్ల పంపిణీ సాఫీగా జరిగేనా అనే అనుమానం అందరిలో కలుగుతోంది.

అధికారుల చర్యలు ఇలా ..

ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం ఉన్నతాధికారులు పింఛన్ల పంపిణీకి ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. రెండు దశల్లో పింఛన్లను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ ప్రకారం మొదటి దశ సచివాలయాల్లో సిబ్బంది ద్వారా, రెండవ దశ ద్వారా సచివాలయాలకు రాలేని వ్యాధిగ్రస్తులు, మంచాన పడిన వారు తదితరులకు ఇంటి వద్దనే ఇవ్వాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సచివాలయాల వద్దకు పింఛన్ కోసం వచ్చే వారి సౌకర్యార్థం టెంట్లు, మంచి నీటి





జిల్లాలో సచివాలయాలు.. సిబ్బంది వివరాలు			
ప్రాంతం	సచివాలయాలు	సచివాలయ సిబ్బంది	వలంటీర్‌లు
గ్రామం	421	3,925	6,852
పట్టణం	218	1,526	3,832
మొత్తం	639	5,451	10,684

సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు.

వయోభారం.. అనారోగ్యం

జిల్లాలో 17 కేటగిరీలకు చెందిన వారు మొత్తం 2,68,179 మంది ఉన్నారు. వారందరికీ రూ.79,31,26,000 నగదును అందజేయాలి. మొత్తం 2,68,179 పింఛన్లలో వృద్ధులు అధిక సంఖ్యలో 1,40,864 మంది ఉన్నారు. అలాగే దివ్యాంగులు 40,391 మంది, డీఎంహెచ్‌ఓ కింద 1,526 మంది, కిడ్నీ వ్యాధిగ్రస్తులు (ప్రభుత్వ, ప్రైవేట్) 490 మంది ఉన్నారు. ఒక అంచనా ప్రకారం వృద్ధుల విభాగంలో సగం మంది వయోభారంతో, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దివ్యాంగుల్లో 75 శాతం మంది నడవలేని పరిస్థితిలో ఉంటారు. డీఎంహెచ్‌ఓ, కిడ్నీ వ్యాధిగ్రస్తులతోపాటు సైనిక్ వెల్ఫేర్, వితంతువులు, చేనేతలు, ఒంటరి మహిళ విభాగాలకు చెందిన వారిలో అధిక సంఖ్యలో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎక్కువ సంఖ్యలో కదలలేని స్థితిలో ఉన్నారు. వారి కందరికీ ఇంటి వద్దనే పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంటుంది. మొత్తం పింఛన్లలో దాదాపుగా 50 శాతం మంది ఏదో ఒక సమస్యతో బాధపడే వారే ఉన్నారు.

తక్కువ సిబ్బందితో మూడు రోజుల్లో సాధ్యమేనా..

అధిక సంఖ్యలో వలంటీర్‌లు ఉన్నప్పుడే పింఛన్ల పంపిణీ నాలుగైదు రోజులకు 100 శాతం నమోదయ్యేది. అలాంటిది సచివాలయ సిబ్బంది తక్కువ సంఖ్యలో ఉండే క్రమంలో మూడు రోజుల్లో పంపిణీ సాధ్యమయ్యే పనేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఒక సచివాలయంలో 11 మంది సిబ్బంది ఉంటారు. అందులో ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తిగత సెలవులో ఉండే అవకాశం ఉంది. అదనంగా సిబ్బందిని తీసుకున్నప్పటికీ వలంటీర్‌ల అంత వేగంగా పింఛన్ల పంపిణీ సాగదనే అభిప్రాయాన్ని అవ్వాతాతలు వ్యక్తం చేస్తున్నారు.

ఉసురు తగులుతుంది



పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా పెట్టాలని చంద్రబాబు ఫిర్యాదు చేయడం శోచనీయం. మంచంలో నుంచి లేవలేని వాళ్లం సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ ఎలా తీసుకోవాలి. చంద్రబాబుకు మాలాంటి వాళ్ల ఉసురు తగుతులుంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పింఛన్ ఇంటి వద్దకే వస్తోంది. తెల్లవారక ముందే పింఛన్ అందేది. వలంటీర్ల సేవలు ఎంతో బాగున్నాయి. అలాంటి వారికి అన్యాయం చేయొద్దు. ఇప్పుడు మళ్లీ మాకు పింఛన్ కష్టాలు ఎదురవుతున్నాయి.

– ఆకుల సంజమ్మ, 8వ వార్డు, మైదుకూరు

పింఛన్ తెచ్చి ఇవ్వడమే పాపమా



మా మనవళ్ల వంటి వలంటీర్లు మాకు పింఛన్ తెచ్చి ఇవ్వడమే పాపమా. ఇంతకు ముందు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా మున్సిపాలిటీ ఆఫీసు వద్దకు పింఛన్ కోసం వెళ్లి ఎండలో సొమ్మసిల్లి పడిపోయే వాళ్లం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఇంటి వద్దకే పింఛన్ తెచ్చి ఇస్తున్నారు. వలంటీర్ల సేవలు మరువలేం. మళ్లీ పింఛన్ల పంపిణీ వారికే ఇవ్వాలి.

– బాబులమ్మ, సాయినాథపురం, మైదుకూరు

ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వారు



ప్రతి నెల 1వ తేదీ తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఇన్నాళ్లు మాకు పింఛన్ గురించి టెన్షన్ లేకుండా ఉండేది. ఇపుడు వలంటీర్లు లేరంటే చాలా టెన్షన్‌గా ఉంది. అసలు మాకు పింఛన్ డబ్బులు ఎప్పుడు చేతికి అందుతాయో అర్థం కావడం లేదు. మేము డబ్బుల కోసం సచివాలయాలకు ఎన్ని రోజులు వెళ్లాలో. అంతా గందరగోళంగా ఉంది. జగనన్న డబ్బులు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకు? వలంటీర్ల ద్వారానే మాకు పింఛన్లు ఇప్పించండి. మాకు అది చాలు. ఇంకేం వద్దు.

– షహజాదీ, వితంతు పింఛన్ లబ్దిదారురాలు, కమలాపురం.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంత రైతులకు సంబంధించి పాడి పశువుల అభివృద్ధికి పశుసంవర్థకశాఖ సహాయకులు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి వారి ఆర్థిక పరమైన అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శారదమ్మ సూచించారు. పశుసంవర్థకశాఖలో ఇటీవల నూతనంగా నియామకమైన పశుసంవర్థక సహాయకులకు మంగళవారం కడపలోని పశుసంవర్థకశాఖ కార్యాలయ ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లాలోని 36 మండలాల పరిధిలో 140 మందిని పశుసంవర్థక సహాయకులను నూతనంగా నియామకం చేపట్టామన్నారు. వీరందరికి జిల్లాలోని జమ్మలమడుగు, కడప, పోరుమామిళ్ల, పులివెందులలో గతంలో శిక్షణ పొందిన పశు వైద్యులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ తరగతులు మే 15 వరకు అంటే 45 రోజులపాటు జరుగుతాయన్నారు. అనంతరం వారికి కేటాయించిన రైతు భరోసా కేంద్రాలలో వారికి సంబంధించిన పశువైద్యాధికారి దగ్గర ప్రాక్టికల్ ట్రెనింగ్‌ను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. శిక్షణ తీసుకున్న పశుసంవర్థకశాఖ సహాయకులు గ్రామీణ ప్రాంతంలో పశువులకు సేవలందించి రైతుల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. పాల ఉత్పత్తికి కావాల్సిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఇలా చేయడం ద్వారా గ్రామం, పట్టణం, దేశం ఆర్థికాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ రమణయ్య, ఏడీలు శ్రీనివాసులరెడ్డి, శ్రీధర్‌లింగారెడ్డి, వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, పశువైద్యాధికారులు చెన్నారెడ్డి, వెంకటేసు, మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాకేష్ కశ్యప్‌కు పదోన్నతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీజీబీ చైర్మన్‌గా పని చేస్తున్న రాకేష్ కశ్యప్‌కు పదోన్నతి లభించింది. ఈయనకు చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం)గా పదోన్నతి కల్పించారు. మూడు సంవత్సరాలుగా ఏపీజీబీ చైర్మన్‌గా పని చేస్తున్న ఈయనకు ఈ పదోన్నతి లభించింది. ఒకటి, రెండు రోజుల్లో పదోన్నతికి సంబంధించిన ఉత్తర్వులు రానున్నట్లు సమాచారం.

రేపటి నుంచి అంగన్వాడీల్లో ఒంటిపూట బడులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ నెల 4 నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంగన్వాడీ కేంద్రాలు పని చేస్తాయని ఆమె పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలను ఇంటికి పంపించాలని సూచించారు. అలాగే ప్రతి కేంద్రంలో చల్లటి నీటికోసం కుండను ఏర్పాటు చేసుకోవాలని ఆమె వివరించారు.

రెండో రోజు మూల్యాంకనం ప్రశాంతం

కడప ఎడ్యుకేషన్ : పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం రెండో రోజు కడప మున్సిపల్ హైస్కూల్‌లో ప్రశాంతంగా సాగింది. మంగళవారం 29,265 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసినట్లు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. మూల్యాంకన కేంద్రాన్ని డీఈఓ, క్యాంపు ఆఫీసర్ మర్రెడ్డి అనురాధ, అసిస్టెంట్ క్యాంపు ఆఫీ సర్ రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సిద్దయ్య (ఫైల్)

చిన్నమండెం : రామాపురం మండలం కల్పనాయునిచెరువుకు చెందిన మండెం సిద్దయ్య(62) అనే వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. సిద్దయ్య కుమారుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు.. సిద్దయ్య అతని భార్యతో కలిసి తన కుమార్తెను చూడటానికి మార్చి 22వ తేదీన చిన్నర్సుపల్లెకు వచ్చాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య



నాగేశ్వరి మృతదేహం

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామానికి చెందిన సిరికోళ్ల నాగేశ్వరి(17) అనే విద్యార్థిని మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకూ.. గత కొన్ని రోజులుగా కడుపు నొప్పి సమస్యతో బాధడుతున్న నాగేశ్వరి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు డిప్లమో ఫస్టియర్ చదువుతోంది.